విమానం యెక్కబోతూనూ

"వెంకయ్యా!"

దిగాలు పడిపోయిన్నీ దిటవు తెచ్చుకుంటూ—బరువుగా అడుగులు వేస్తూ-అప్పుడే గుమ్మందాటి వచ్చిన చెలికాని వెంకయ్యను చూసి, యెదురు చూస్తూనే వున్న మల్లమ్మ, యిలా అంటూ లేచి నుంచుని రెండడుగులు ముందుకి వేసింది.

'ఏమి తల్లీ?''

''ఏమని సెలవు?''

''ఇదిగో కైజారు''

ఇలా అంటూ, అతను, చర్రుమని వొరలోంచి కైజారు తీసి పట్టుకుని చెయ్యిచాపాడు. "రాజుగుండ్డెలు తియ్యడానికేనా?" అంటూ ఆమె అది అందుకుంది.

"అదెలాగ మా తల్లీ?''

"ఎలాగంటే? నేను వెలమబిడ్డను కాదుటయ్యా?''

"అది పురుషుల పని తల్లీ''

"వెలమల ఆడవాళ్ళు చేతగాని వాళ్ళా?''

"వెలమస్త్రీలు అసూర్యంపశ్యలు కారు టమ్మా?''

"అంటే?''

"అంటేనా?''

ఉలిక్కిపడ్డాడు వెంకయ్య. ఇది ప్రతిఘటనం అన్నట్టు కూడా తోచిందతనికి. ''ఇదేమిటి చెల్లెమ్మా యివాళ కొత్తమాటలు మాట్లాడుతున్నావూ ఇది నీకు తెలవందా? నేను చెప్పాలా?''

''ఇప్పుడు మీ అర్థం యేమిటో అని-''

''ఇప్పుడేమిటప్పు డేమిటి, యెప్పుడూ వో-క్కటేఅర్థం, మీరు బయటికి రాకూడదు''

''మంచి అర్థమే. ఏం, బయటికి వస్తే?"

''తమ స్త్రీలు పరపురుషుల కంటపడ్డ తరవాత, యిక వెలమలకు మర్యాద యెక్కడిదమ్మా?"

''ఎంత పాపిష్టి బతుకయ్యా మాదీ? మాలమాదిగల దగ్గిర్నుంచి బ్రాహ్మలదాకా అన్ని వర్ణాలస్త్రీలూ అవసరం వచ్చినప్పుడు బయటికి వస్తూ వుంటే, వారికిలేని మానభంగం మాకెలా వస్తుందయ్యా"

''మొదణ్ణుంచీ అది మన ఆచారం కాదుటమ్మా?''

"స్థితి విషమించినప్పుడు కూడా అంతేనా?"

"తెగించినవాళ్ళకి విషమించడం యేమిటి తల్లీ?"

"అదీ మాట. మరి మేము తెగించవద్దూ?"

"అవశ్యమూనూ."

"ఎందుకో?"

"ప్రభువు ఆజ్ఞ నెరవేర్చడానికి."

"గొంతుకు పిసుక్కోడాని కన్నమాట.... అవునా?"

ఈ మాటలో శౌర్యం తలమునక లయింది.

అతను మొగం వంచుకున్నాడు.

''అంతేనా?''

మొగం పైకెత్తాడు; గాని పక్కకి తిప్పుకున్నాడు.

"మాట్లాడ వేమయ్యా?"

"ఏమి చెప్పను తల్లీ?"

"ఏమి చెబుతావూ? ఏమి చెప్పగలవూ?........ ఎంత కర్మమయ్యా? శత్రువు వచ్చి పీకమీద కూచున్నప్పుడయినా మొగవాళ్ళకి తలదాటి వచ్చినప్పుడయినా—"

"వెలమవీరులకు తలదాటి రావడం యేమిటమ్మా?"

ఈమాట అనేటప్పుడతని చూపులు చెరకాకు బల్లేలయిపోయాయి.

"ఏమిటీ?........ మళ్ళీ అను ఆమాట"

"ఏం అనకా?"

"అయితే, యిప్పుడు నీ రాకకు కారణం?"

"అది దొరవారి ఆజ్ఞ"

"అదేనయ్యా! పోనీ, దానిక్కారణం?"

"మానభంగభయం—"

"ఏమిటీ?........ ఎవరికీ? బొబ్బిలి వెలమస్త్రీలకే?"

మల్లమ్మ యిలా వురిమింది. గతుక్కుమన్నాడతను.

"మేము యుద్ధరంగలోకి వెడితే పగవాళ్ళికంతకంటే కఠినంగా మాట్టాడతారా?"

"తర్కానికిది సమయమా అమ్మా?"

"అది నేనడుగుతున్నమాట. వెలమస్త్రీలు బయటికి రాకూడదన్నది సామాన్యధర్మం. స్థితి విషమించినప్పుడెందుకు రాకూడదూ?"

"వెలమలు ఇదివరలో చేసిన యుద్ధాల్లో ఎప్పుడయినా స్త్రీలు కత్తి పట్టడం—"

"శత్రువు దుష్ప్రయత్నాలు ఫలించడానికి సిద్ధంగా వుండడమూ—పైవారు కోట విడిచి పొమ్మనడమూ—"

"ఒకదానికొకటి యెప్పుడైనా పోలిక వుంటుందా?"

"మరి యింకెందుకామాటా? అప్పటప్పటి వెలమస్త్రీలు యుద్ధరంగాలకెందుకు వెళ్ళలేదో మనకేం తెలుసూ?"

అతనికి జవాబు తోచలేదు.

"కాకపోయినా, ఇప్పుడు మనకి వచ్చిన అవస్థలవంటివే వారికీ వచ్చాయనీ, అయినా అప్పటి వెలమస్త్రీలు యుద్ధరంగాలలోకి వెళ్ళక అంతఃపురాల్లోనే పొడుచుకునో, కాల్చుకునో బుగ్గి అయిపోయారనీ నిదర్శనాలేవీ? అదీగాక: వారు వీరమాత లయివుండవచ్చు. వీరపత్నులున్నూ అయి వుండవచ్చు. తాము వీరాంగనలే అని అనిపించుకోడానికి వారు ముచ్చటపడి వుండకపోవచ్చు.

ఇప్పుడు మే మలా కాదు. కోటలో వున్న వెలమస్త్రీ లందరూ 'మనమైనా విజయ రాముణ్ణి పొడిచెయ్యవద్దా?' అంటున్నారు. మా శౌర్యం అంతా యేమి కానూ? కత్తి పట్టాలని నాకు సరదా పుట్టింది. నేను వీరమాత నవుదునో కానో తెలుసు కోవాలంటే నా బిడ్డ పాలబుగ్గలవాడయిపోయె. ఇక నేనేం చెయ్యాలి? చిన్న తనంలోనే "మల్లమ్మ యెన్నిక అయిన"దని పేరు తెచ్చుకున్నాను. నీ ప్రభువుకి తగిన రాణి ననిపించుకున్నాను. మరి యిక "విజయరాముడి పాలిటి మహిషాసుర మర్దని" ననిపించుకో వద్దుటయ్యా?"

ఈ మాటలతో వెంకయ్య చెవులు గళ్ళుపడ్డ ట్టయిపోయాయి.

"ఏ మంటావు వెంకయ్యా?"

ఏదో అనబోయాడు కాని మాట రాలేదు.

"వెలమల ప్రయత్నాలు వ్యర్థం అయినప్పుడు — వెలమ దొరల శౌర్యం నిస్తేజం అయిపోయినప్పుడు — "

"ఏ మన్నావు తల్లీ?"

ఇలా అంటూ అతను వుద్రిక్తుడైనాడు. ఈ మాటలో అతని శౌర్యం అంతా మూర్తీభవించింది.

"ఉలిక్కి పడకు. నువ్విప్పు డేమి చెయ్యడానికి వచ్చావో తెలుసుకు మరీ మాట్లాడు........చూడూ. బొబ్బిలి వెలమ వీరుల ప్రతాపం మొక్కపోయి నప్పుడు — "

"వినలేను, అమ్మా! సహించలేను. నువ్విక యీ ధోరణి మార్చకపోతే నా రక్తం వుడికెత్తిపోయి — "

అతని చెయ్యి గభీమని కైజారుమీదికి పోయింది.

"ఇంకా యెప్పుడో వుడుకెత్తుతుంది. ఇప్పటికి మంచుగడ్డలాగే వుంది, కదూ?"

"హరహర! మహాదేవ! చెల్లెమ్మా!"

ఇలా అంటూ, పళ్ళు పటపట కొరుకుతూ, కైజారుదూస్తూ, నిప్పులు కక్కుతూ పైకి చూశాడు. వీరావేశంతో అతని శరీరం ఆపాద మస్తకమూ మెరుపుతీగ అయిపోయింది; కాని ఆ చూపులకు "నేనేం చెప్పాను? నువ్వేం చేస్తున్నావు?" అంటూ కసురుతున్నట్టు రంగారావు ఉగ్రముఖం కనపడింది.

వెంటనే గభీమని ఆ వుద్రేకం అడ్డుపడిపోయింది. మొగం వాలిపోయింది. దంతఘర్షణం క్రమాంతరువులలో తగ్గుతుండగా, తల్లీ... తల్లీ ... తల్లీ...." అని ఆగి ఆగి పలుకుతూ అత నది నిట్టూర్పులుగా మార్చేశాడు.

చెయ్యి, తోటకూర కాడలాగ వేలాడిపోయింది.

ఈ బుస్సలూ, యీ చల్లబడి పోవడమూ మల్లమ్మకు ఏవ పుట్టించాయి.

"వీరాలకా విరోధులు లొంగుతారు? ఒక్క రోజుకే నిరాశ చేసుకోవలసి వచ్చినప్పుడు వెలమల కింకా మర్యాద అంటే యేమిటయ్యా? నిజంగా, ఇప్పుడు, బొబ్బిలి వెలమల రక్తం వుడుకెత్తేస్థితిలోనేవుంటే శత్రు వింకా అలా కులుకుతూ వుంటాడా? ఏమి దుష్కాలం వచ్చిపడింది?"

"కాలం దుష్టమయిపోయింది కనకనే ప్రభువు ఆజ్ఞ యిలా వుంది."

"తప్పు, తప్పు. కాలం దుష్టమయిపోయింది కనకనే స్త్రీలు కూడా కత్తి పట్టాలి. వీరాధివీరు డయ్యుండిన్నీ బొబ్బిలి మీదికి రాజు సొంతంగా రాలేక పోయాడు. వజ్రాలవంటి మహాయోధులు పదుగు రుండినా అతగాడు తురకల సాయం పుచ్చుకున్నాడు. దాని ఆంతర్యం మీ రేమయినా గ్రహించ గలిగారా? ఇలాంటి స్థితిలో స్త్రీల సాయం పుచ్చుకోడం వెలమలకు లజ్జాకారణం కాదని వూహించలేరా వెలమలు?"

అతనేదో అనబోయాడు; గాని అంతలో,—

"పైగా, పురుషులు స్త్రీలను కోరడం కాదిది. స్త్రీలే పురుకుతామనడం. భేదం యే మయినా తెలిసిందా?"

"ఫలితం —"

"ఫలితమా? వెర్రివాడా? రాజు బొబ్బిలిమీదికి సొంతంగా రాలేకపోయా డంటే అది అతనికి స్త్రీత్వం కాదుటయ్యా? అలాంటి శత్రువును బొబ్బిలి వెలమ దొరసానులే పరిమారిస్తే ఫలితం యెంత చక్కగా వుంటుందో వూహించుకో లేవు టయ్యా?"

"తల్లీ —"

"ఇలా చూడు నాయనా! రాజా శ్రీ రావు రంగారావు దొరవారికి నేను ధర్మపత్నినే. మరి వారికి సహధర్మచారిణ్ణని కూడా అనిపించుకోవద్దు టయ్యా?"

"కాక ఇప్పుడేమి లోటు వచ్చిందమ్మా?"

"ఏమి మిగిలింది తండ్రీ? 'బొబ్బిలి రాణికి మూడూళ్ళు ముండభరణం యిస్తా' నన్న రాజు బతికేవుండగా, బొబ్బిలి రాణి ఆత్మహత్య చేసుకోడమా? ఇది నాకు మానభంగం కాదూ?"

"ముండభరణం" అనే మాట అతనికి చురుక్కు మనిపించింది. "అలా అంటాడా?" అని రాజు మీదా, "అలా కబురంపడం యేమీ?" అని మల్లమ్మ మీదా అతనికి చాలా కోపం వచ్చింది. అయితే, అది ప్రారంభంలోనే మిళిత మయిపోయి యేకధారగా రావడంవల్ల ఇక్కడ ప్రకటించడానికి వీలులేక —

గుండెలు తాళక లోపల్లోపలే అణిచేసుకున్నాడు. ఈ ప్రయత్నంలో వుండడం వల్ల అతను మరి జవాబయినా చెప్పలేకపోయాడు.

"మీ ప్రభు వెక్కడయ్యా?"

"మొగసాలలో – వెలమల మధ్య – సర్వసన్నద్ధులై – "

"వెళ్ళి యీ సంగతి చెప్పి రా?"

"ఆజ్ఞ లేదు తల్లీ!"

"పోనీ, నేనే వెడతాను. నా కడ్డేమిటి?"

"నీ కడ్డేమి టమ్మా? నిన్నడ్డుకోడాని కెవడికి గుండెలున్నాయి తల్లీ? అయితే – ముందిక్కడ పొడిచి – "

ఇలా అంటూ అతను, తర్జనితో నిర్దేశించుకుంటూ యెదురొమ్ము విరుచుకు నుంచున్నాడు.

"ఏమి మాట అన్నావు? అదా మల్లమ్మ చేసే పని! ఎంత చక్కగా వూహించావూ? నేను కైజారు దుయ్యడమే వస్తే అది రాజు పేగులు బయటికి తియ్యాలి. స్వజనంమీద టయ్యా నా ప్రతాపం?"

ఈ మాట శూలమై అతని గుండె దూసుకుపోయింది. దాంతో మాట నిలిచిపోయింది.

"మల్లమ్మ అంటే నీకు వో–ర్తి స్వపక్షపరపక్ష నిర్ధూమధాముఠాలని తోచిందా నాయనా?"

పక్కవాటుగా వున్న మొగం ఆమెకేసి తిప్పుకున్నాడు; కాని చూపులు మాత్రం తివాసీమీదే వున్నాయి.

"అయితే, వెంకయ్యా! నాకిక నా దేవుడి దర్శనం లేదుటయ్యా?"

అప్పటికి గుక్క తిప్పుకోగలిగాడు. అయ్యవార్లంగారు నూరిపోసిన పురాణసారం అంతా గభీమని నెమరికి వచ్చింది. దాంతో "ఈ క్షుద్రమానవ కళేబరం విడిచిపెట్టేసిన తరవాత అది శాశ్వత బ్రహ్మకల్పమే కాదుటమ్మా నీకు?" అంటూ మొండిగా బదులు చెప్పాడు.

"మెట్టవేదాంతం చాలించు. ఈ మానవ కళేబరం వున్నంతసేపే– మానవ కళేబరానికే పగ అయినా, కసి అయినా"

"ఈ కళేబరం శాశ్వతమా?

"నీ వెలమతనం మాత్రం శాశ్వతమా?"

అతను మళ్ళీ మొగం వంచుకున్నాడు.

"బొబ్బిలి కొట్టడానికి వచ్చిన రాజుకి మాత్రం తన కళేబరం శాశ్వతం కాదని తెలవదూ?"

"ఈ బొబ్బిలి పాటిమీదే అది వారక్కపోతే కదా?"

"అవనే కాదూ నేను చేస్తానంటున్నదీ?"

యుక్తితోచక, అతను "వాగ్వాదం చాలించవు తల్లీ?" అని లాలనగా అడిగాడు.

"బొబ్బిలి బేరి కోమటి రమణులు గోల్కొండ సరదార్లను తూనిక రాళ్ళతో చీకాకుపరిచారుట. బొబ్బిలి పాటకపు స్త్రీలు విజయనగరం సరదార్లను రోకళ్ళతో కుమ్మారుట. బొబ్బిలి వెలమదొరసానులా మాత్రం అయినా కారుటయ్యా?"

"ప్రభువు నాకోసం కనిపెట్టుకుని వుంటారమ్మా?"

"నువ్వు కూడా వుంటే కాని వారు రాజుమీదికి వెళ్ళరూ?" తోడబుట్టపులనూ, తల్లులనూ, పిల్లలనూ, పొడిస్తేగాని నీకు పౌరుషం రేకెత్తదు కాబోలునేం?"

పేగులు తోడేసినట్టయిపోయి, అతను నిట్టూర్పు విడుస్తూ కళ్ళు మూసుకున్నాడు.

"ఎంత పాపం బద్దలాసిపోయిందయ్యా! సత్యభామకాసె బిగించి విల్లు వంచి నరకాసురుణ్ణి గజగజ లాడించి వేసింది. ఓరుగంటలో రుద్రమ్మా పల్నాటిలో నాగమ్మా కత్తి విసరగా పర సేనలు చెల్లాచెదరయిపోయాయి. మరి బొబ్బిలిగడ్డమీద, మల్లమ్మ కైజారుదూస్తే రాజేమయిపోతాడో లోకానికి తెలవవద్దుటయ్యా?"

"ఊహలతో యేమి లాభం తల్లీ?"

విసిగిపోయి అతనిలా అనేటప్పటికి, తోకతొక్కిన తాచులాగ, ఆమె "ఊహలా? ...ఏమిటీ?" అని కస్సుమంది.

"జరుగుతుందో జరగదో—"

"ఇంకా అదేమాటా? వెలమవీరుడినోట రావలసిందేనా యీ మాట?

"............"

"నేటికి బొబ్బిలిగడ్డ విరిగిపోయిందా?"

"............"

"తాండ్ర పాపారాయణింగారుంటే—"

"పాపారాయణింగారికీవార్త అయినా తెలిసిందో లేదో? అక్కడ రాజాము కోటగతి యేస్థితిలో వున్నదో?"

"నిజమే పాపారాయణింగారికీవార్త అయినా తెలిసిందో లేదో? రాజాము కోట సంగతి అలావుంచు. బొబ్బిలికోటమాట యేమిటీ? ఇక దీనికి నీళ్ళు పదులుకోవలసిందేనా?"

"..............."

"పాపారాయణింగారు లేరు. తక్కినవారంతా? బీరాలు పలికిన వెంగళ రాయణింగారేం చేస్తున్నారయ్యా? చెలికాని వేంకటరాయణింగారి సంగతి కనపడుతూనే వున్నది, మరి రావు చిన్నారాయణింగారి సంగతి కనపడుతూనే వున్నది, మరి రావు చిన్నారాయణింగారు, ఇనగంటి నరసారాయణింగారు, కాకర్లపూడి వెంకటరామరాజుగారు, పంతెన బుచ్చన్న గారు — ఏరయ్యా వీరంతానూ, ఏంచేస్తున్నారయ్యా? రాజు దుర్మణవార్త నా చెవిని వెయ్యి గల మొగవాడు బొబ్బిలి పాటిమీద లేడుటయ్యా?"

"..................."

"మాట్టాడవు.... అయినా ఏమని మాట్టాడతావూ? కత్తి ఝళిపిస్తూ జనానాలోకి వచ్చావు. మహాగొప్ప పని దొరికింది నీకు; కాని, నాయనా! బొబ్బిలి వెలమదొర సానులకు, పగవాళ్ళని పొడిచెయ్యడానికి లేకపోతేమానె, సొంతంగా పొడుచుకోడానికయినా అవకాశం వుండనియ్యి"

"..................."

"నూరుకుటుంబాల వెలమస్త్రీలు. చికిలీచేసిన చంద్రహాసాలు. కష్ట సమయంలో వుపకరించవలసిన యెంతశక్తి అడవిగాసిన వెన్నెల అయిపో తున్నదీ? బొబ్బిలికిలాంటి పాట్లు వచ్చినందుకు వారెంత కుమిలిపోతున్నారో, శత్రువులను చీల్చి చెండాడాలని యెంత తహతహ లాడిపోతున్నారో యెవరు చూశారూ? వెంకయ్యా, ఇష్టం లేకపోతే జయించినా మేము బతకమయ్యా! చచ్చిపోడానికయినా యుద్ధంలో వురకడానికనుజ్ఞ యిమ్మని అడగవయ్యా దొరగారిని"

"నీకు పది జవాబు లెందుకుతల్లీ? మాకు అక్కడ రంగారాయణింగా రెంతో యిక్కడ మల్లమ్మ అంత"

"అయితే, యుద్ధంలోకి వెడదాం పద"

"అది రాజాజ్ఞకి వ్యతిరేకం తల్లీ"

"ఇంకెందుకూ మరి పొగడడం?"

"నేను రావువారి సేవకుణ్ణి. దొరవారి ఆజ్ఞ యిలా వున్నది. జవదాట డానికి నేనెంత—

"అది దొరవారి ఆజ్ఞ అయితే, యిది దొరసానిగారిఆజ్ఞ, వెళ్ళి మీదొరగారి నిలా తీసుకురా"

"పని కాకుండా కళ్ళబడడానికి ఆజ్ఞలేదు తల్లీ"

"అంతే?........ ఎంత చెప్పినా అమాటే? మనం పోయినా లోకం వుంటుంది. బొబ్బిలి వెలమలు, అమానుష చర్యలు నడిపిన రాజుని పొడిచెయ్యలేక పోయారనీ, ఆ పని చెయ్యడానికి స్త్రీలు సిద్ధపడగా అడ్డుకున్నారనీ-"

"..................."

"వెంకయ్యా?"

"అమ్మా!"

"ఏమంటావు?"

"ఆలస్యం అయిపోతున్న దంటాను. దీనివల్ల యేమీ ప్రయోజనం లేదంటాను"

"అంటావు........ అనవూ మరీ? దొరకి తగిన జెట్టివి. ఈ విషయంలో అయినా యింత స్థిరంగా వుండగలిగినందుకు చాలా సంతోషిస్తున్నాను. నాయనా! ఆలస్యం అయిపోతున్నది - అయేపోయింది కాదూ? ఏమంటేయేం చెబుతా వక్కడ? "పగవాడి గుండెలు తియ్యవలసిన కైజారు చేసుకున్న పెళ్ళాం మీదికి తిప్పారా" అని అడిగిందని చెప్పేం? "శత్రువుల చేజిక్కి మేము మానభంగం పొందకుండా యిలా ముందు జాగ్రత్త వహిస్తున్నట్టే, యీ స్థితి సంభవించకుండా వుండేటట్టు పైనుంచి తాఖీదు వచ్చినప్పణ్ణుంచీ జాగ్రత్తపడి వుంటే యెంత బాగుండిపోవునూ?" అని అడిగిందని కూడా చెప్పేం?"

"..............................."

"పట్టుమంటే గుప్పెడుండదు ప్రాణం, దానికోసంకాదు సుమా యీ రాద్ధాంతసిద్ధాంతాలు. కన్ను మూసి తెరిచేటప్పటికి లోకం యెక్కడో యీజీవు డెక్కడో? ఇదివర కిలాంటి తలుపు లెన్నయినాయో? ఎన్ని అనుభవాలు సంభవించాయో? ఇకముందెన్ని కనిపెట్టుకున్నాయో? కాని యింతకంటే నికృష్టత మరి వుండదు. ఇంతకంటే దౌర్భాగ్యం మరి తటస్థించదు. పగవాడు కాని మాటలాడడమూ, మొగవాడు కాని చేత చెయ్యడమూనూ, శరీరం పుడికి పోతున్నదయ్యా! ఇంతకంటే చిత్రవధ మేలుసుమా"

అతనికి చెయ్యి పెట్టి కడుపు కలిచేసి నట్టయింది.

"ఆత్మహత్య మహాపాతకం అన్నారు పెద్దలు. కాని బొబ్బిలి రాణికి అదే సంభవించింది. పొడిచి పొడిచేసుకుంటే యీ తహతహ లేకపోవును. బొబ్బిలి కొట్టాలని యెక్కడ సంకల్పం కలిగిందో ఆ రాజు గుండెలమీద

కసుక్కున వొక్కపోటు పొడిస్తే తరవాత యేమయిపోయినా యీ ఆరాటం లేకపోవునయ్యా"

"......................"

"ఇప్పుడే మనుకుంటే యేమి లాభమూ? నిన్నుమాత్రం యెన్నంటే యేమి ప్రయోజనమూ? రంగారాయణింగా రంతటి వీరాధివీరుడి యిల్లాలికే యిలాంటిగతి తప్పనప్పుడిక యితర్ల మాట చెప్పేదేమి వున్నదీ? బతికుంటే బొబ్బిలి రాణికి శరణమే యిస్తాడు విజయరాముడు-"

"అమ్మా!"

"ఏమినాయనా! నీ వీరవిహారానికి మల్లమ్మ అడ్డువచ్చిందా? ఇదిగో పంపేస్తున్నాను. ఇంతసేపువాగాను, వాగడం వొక్కటే కనపడుతున్నది; కాని మరేమీ లేదు, నిజమే. పగతీరకుండా చచ్చిపోయాటప్పు డిక యెవరి నేమంటే యేమి వస్తుందీ? అక్కసుప్పట్టలేక యేమి టేమిటో అన్నాను. క్షమించాలి సుమా అన్నయ్యా! మల్లమ్మ మంచీ చెడ్డా చెప్పేదే కాని, చివరికి, ఆజ్ఞ జవదాటేది కాదని చెప్పి, తప్పులు మరిచిపొమ్మన్నా నని ప్రార్థించినట్లు కూడా మీ బావగారితో చెప్పాలి సుమా అన్నయ్యా!"

"......................"

"శ్రీమన్నారాయణమూర్తీ! సూర్యచంద్రుల్లారా! ఇదే నా కడపటిపూజ. ఇదేనా కడపటి నమస్కారం. ఇదే నాకడసారపు ప్రార్థన. పాలబుగ్గల వాడయిన నా బిడ్డని చల్లగా చూడండి, నా ఆయువంతా అతనికి పొయ్యండి. బొబ్బిలి రావువారి రాజవంశం అతని పేరుగా నిలపండి. అకాలమరణం పొందుతున్న యీ వెలమవీరుల శేష శౌర్యం అంతా అతనికి దఖలుపరచండి. నా భర్తగారు చెయ్యవలసిన పని అతనిచేత చేయించండి. అదే నాకు పదివేలు, అదేనాకు వరప్రసాదం. అప్పుడే నాయాతన తీరుతుంది........కైజారు పదును గానే వుంది. లేకపోయినా సాహసం వుంటే తడిపాతే చాలుతుందెంతకైనా.

శ్రీహరీ! శ్రీహరీ! శ్రీ....హ....ర్....ఈ....''

ఒక్కటే పోటూ, ఒక్కటే పాటూను.

వెంకయ్య కళ్ళు చిరతలు కమ్మాయి. చివరికి అతని కళ్ళకి అంతా శూన్యంగా కనపడింది, క్షణంలో అతని చేతులు రాణి వాసం శూన్యం చేసేశాయి.

1926, ఫిబ్రవరి

(భారతినుంచి సవరణలతో)